క్లుప్తంగా

పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషుకుమార్

తుంగతుర్తి : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శేషుకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన అమ్మ ఆదర్శ పాఠశాలల అత్యవసర పనులపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ పాఠశాలలో పనులు ఎంతవరకు జరిగాయో ఆ పాఠశాలలోని కమిటీలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంఈఓ బోయిని లింగయ్య, ఏపీఎం నరసయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

వారాంతపు సంత వేలం

అర్వపల్లి : అర్వపల్లిలో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంత నిర్వహణకు ఏడాదికి గాను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. తైబజార్ నిర్వహణకు వేలం వేయగా రూ.1.95లక్షలకు స్థానిక రైతు కొమారి శ్రీరాములు పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, మాగి నాగయ్య, సాయిని యాగానందం, సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల స్పందన


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సూర్యాపేట: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చలసాని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో ఈనెల 18,19,20 తేదీల్లో జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభలో జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. సమస్యలపై మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. సూర్యాపేట పట్టణం, నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసి మాట్లాడుతామన్నారు. ఆయన వెంట జర్నలిస్టులు బంటు కృష్ణ, మల్లికార్జున్, విజయ్, ఎడ్వర్డ్, చందన్, రామకృష్ణ ఉన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా రాజారాములు



అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నికను శుక్రవారం తుంగతుర్తి పాలశీతలీకరణ కేంద్రం అధికారులు నిర్వహించారు. చైర్మన్‌గా అంకిరెడ్డి రాజారాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు పాల్వాయి చిరంజీవి, కేసగాని నర్సయ్య, కోనేటి కళమ్మ, గోసుల రాములు, తూడి నర్సయ్య, గద్దగూటి తదితరులు పాల్గొన్నారు.

మంగయ్య మృతి తీరనిలోటు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఇస్తాలపురం గ్రామ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మొరిగాల మంగయ్య(52) మృతి పార్టీకి తీరనిలోటని బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తంగళ్ల కరుణాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో మంగయ్య మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి శిగ శ్రీనివాస్, ముసుగు రామచంద్రారెడ్డి, పాండునాయక్, ఫయాజ్, సత్యనారాయణరెడ్డి, ఇరుగు శ్రీను, భూతం లింగయ్య, శాంతయ్య, అనిల్‌కుమార్, బిచ్చు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి ఇంటి ముట్టడిని జయప్రదం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటిముట్టడిని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంబీబీఎస్, ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ ఎంట్రన్స్ పరీక్ష లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతే కారణమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సూరం విజయ్‌రెడ్డి, ఉపేందర్, వీరేష్, వీరబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల్‌కుమార్

వేధిస్తున్న సిబ్బంది కొరత

- పీహెచ్‌సీలో వైద్యం అందక రోగుల అవస్థలు
- ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు
- సిబ్బందిని నియమించాలని వేడుకోలు


మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెన్‌పహాడ్ : మండలంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆయా మండల కేంద్రాలల్లో గత ప్రభుత్వాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఈ పీహెచ్‌సీలపై పర్యవేక్షణ లేకపోవడంతో సామాన్య రోగులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంటుంది. పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉండడంతో రోగులకు వైద్యం అందని దుస్థితి. నాడు నిరంతరం వైద్య సేవలు అందించడంతో మోడల్ ఆసుపత్రిగా సౌకర్యాలు కల్పించారు. దీంతో అప్పటి గవర్నర్ నరసింహన్ ఇచ్చి వైద్య సేవలను పరిశీలించి వెళ్లారు. అధికారుల, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు వెలవెలబోతోంది. సరైన వైద్య సేవలు అందక రోగులు ప్రైవేట్ దవాఖానాలకు పరుగు తీస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గతంలో వైద్య సిబ్బంది, రోగులు, వారి వెంట వచ్చే సహాయకులతో సందడిగా ఉండేది. 24గంటల వైద్య సదుపాయాలతో పాటు సాధారణ కాన్పులు నిర్వహిస్తుండటంతో మండల పరిధి ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల వారు చికిత్స కోసం ఈ వైద్యశాలను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ఇద్దరు వైద్యలకు బదులు ఒక్కరే ఉండటం, ఇద్దరు స్టాఫ్‌నర్సు, 2 ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్‌నర్సు పోస్టులు కొరత కారణంగా సమయానికి వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాన్పు కోసం వస్తున్న గర్భిణులు వైద్యసిబ్బంది లేక ఇబ్బందులు పడుతూ సూర్యాపేట ఆసుపత్రికి వెళ్తున్నారు. దీంతో ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ మూతపడింది. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకునే ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రిపై నిర్లక్ష్యం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు, వైద్య సదుపాయాల సంగతి ఏలా ఉన్నా.. రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకే వైద్యుడు ఉండటం, 24గంటల పాటు వైద్యసేవలు అందించాల్సి ఉండగా వైద్య సిబ్బంది కొరత కారణంగా రాత్రి వేళల్లో వైద్యం అందక రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఇదే విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో మాజీ సర్పంచ్‌లు పలుమార్లు ప్రస్తావించినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పేరుకే 24గంటల ఆసుపత్రి అని, అత్యవసర సమయంలో ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ అసుపత్రులను ఆశ్రయించాల్సి పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. మండల వైద్యాధికారి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగావ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. సిబ్బందిని నియమించాలని, సమయపాలన పాటించాలని ఆస్పత్రి ఎదుట పలు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆస్పత్రిలో వైద్యసిబ్బందిని నియమించి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి**
>
> ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది కొరత వేధిస్తుండడంతో రాత్రి వేళల్లో రోగులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి సిబ్బందిని నియమించి 24గంటలు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలి.
>
> – శ్రీనివాస్, పెన్‌పహాడ్

> **రాత్రి వేళల్లో సేవలు అందించలేకపోతున్నాం**
>
> స్టాఫ్‌నర్సుల కొరత కారణంగా ఆసుపత్రిలో రాత్రి వేళల్లో వచ్చే రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించలేకపోతున్నాం. సిబ్బంది కొరత ఉందని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించాం.
>
> – స్రవంతి, వైద్యాధికారి, పెన్‌పహాడ్

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- ఎమ్మెల్యే మందుల సామేల్


సమావేశంలో మాట్లాడుతున్న మందుల సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ రూ.10కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాబోయే వర్షాకాలం సీజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అదనంగా 28మందిని నియమించాలని, మున్సిపల్ సిబ్బందికి పెరిగిన రూ.1000 అదనపు వేతనాన్ని మే నెల నుంచి ఇవ్వాలని తీర్మానించారు. మున్సిపాలిటీలో పని చేయకుండా అక్రమంగా నియమించబడిన సిబ్బందిని వెంటనే తొలగించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, వైస్‌చైర్మన్ కేశిడి సరళా యాదవరెడ్డి, తహసీల్దార్ సుధ, ఎంపీడీఓ లాజర్, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వేముల రామకృష్ణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి బాధితుడి చికిత్స కోసం రూ.1,70వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించి శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుడి భార్య వేముల సరస్వతికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రయ్య మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెలే కిషోర్‌కుమార్

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు తీగుళ్ల యాదగిరి తండ్రి తీగుళ్ల చంద్రయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ చంద్రయ్య భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25వేల ఆర్థిక సాయం అంజేశారు. ఆయన వెంట ఎంపీపీ కూరం మణివెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, అంబయ్యగౌడ్, రఘునందర్ రెడ్డి, కిరణ్, లాజర్, రాజు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రఘువీర్‌రెడ్డి

నాగారం : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్‌లను నమ్మొద్దని సూచించారు. సైబర్ నేరాలతో అనేక మంది మోసపోయి తమ డబ్బులు పోగొట్టుకుంటున్నారని, ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం బ్యాంక్ వివరాలు, ఏటీఎం నంబర్లు, ఓటీపీ తదితర వాటిని బహిర్గతం చేయవద్దన్నారు. మెసేజ్‌లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దన్నారు. సైబర్ మోసాలపై టోల్‌ఫ్రీ నంబర్ 1930, లేదా 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని, మహిళల రక్షణపై పోలీసుశాఖ పటిష్టంగా పని చేస్తుందని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా పరిష్కరించుకోవాలన్నారు. ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి, సోషల్ మీడియాలో ఎవరినైనా ఉద్దేశించి అభ్యంతరకరమైన పోస్టులు పెట్టరాదన్నారు. అనంతరం పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతో సామాజిక అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరాములు, పోలీస్ సిబ్బంది యల్లయ్యగౌడ్, లింగయ్య, వీరునాయక్, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపి, క్రిష్ణ, చారి, గురులింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో పుస్తకాలు, బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల సంక్షేమం కోసం దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలోని 93మంది విద్యార్థులకు ఎక్సైజ్ డీఎస్పీ బిక్కి గుర్వయ్య ఆర్థిక సహకారంతో రూ.28వేల వ్యయంతో కొనుగోలు చేసిన పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులను ఆయన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఆలోచనతో ఆర్థిక సహాయ సహకారాలు అందించిన దాతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.సోంబాబు, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు బాణాల సంధ్య, మాజీ ఉపసర్పంచ్ తొట్ల ప్రభాకర్, పులుసు సత్యం, బత్తుల సుధాకర్, బొజ్జ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం


జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : ప్రొఫెసర్ జయశంకర్ జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. ఆయన తెలంగాణ రాష్ట్రానికి చేసిన త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, శ్రీనివాస్, రవి, సంతోష్, సాయి పాల్గొన్నారు.

పుస్తక ఆవిష్కరణ కరపత్రాల విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

తుంగతుర్తి : ప్రజల మనిషి తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 23న నూతనకల్ మండల కేంద్రంలో తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తొట్ల మల్సూర్ గీత కార్మికుల కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. ప్రజల కోసం సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పులుసు సత్యం, అబ్బగాని భిక్షం, ఆకుల రమేష్, వర్దెల్లి లింగయ్య, వగలగాని భిక్షం, వెంకన్న, రాములు, సత్యం, వీరయ్య, మల్లయ్య, ఉషాన్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు


లిక్విడ్ డీఏపీని ప్రారంభిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

నూతనకల్ : రైతులు వివిధ పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి మురళీ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రంలో డీఏపీ కాంప్లెక్స్ ఎరువుకు బదులుగా లిక్విడ్ డీఏపీని ప్రారంభించి ఆయన మాట్లాడారు. విత్తనం నాటిన 20నుంచి 25రోజుల తరువాత నేలలో తేమ ఉన్న లేదా వర్షం పడిన తరువాత కాంప్లెక్స్ వేస్తాం. తేమ లేకపోయినా వర్షం పడకపోయినా మొక్కలకు డీఏపీ వేయడంతో పోషక పదార్థాలు అందవని, లిక్విడ్ డీఏపీని స్ప్రే చేయడంతో మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రోమోర్ మార్కెటింగ్ జోనల్ మేనేజర్ రాజు, తిరపతిరెడ్డి, చిరంజీవి, అంజయ్య, సురేష్, సైదులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి


చివ్వెంల : యోగాసనాలు వేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి గోవర్ధన్‌రెడ్డి, న్యాయమూర్తులు

చివ్వెంల : యోగా సాధనతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి, పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులతో కలిసి కొద్దిసేపు యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ, థైరాయిడ్ వంటివి నయం కావాలంటే రోజు అరగంట సేపు యోగా సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జిలు కె.సురేష్, జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత

సూర్యాపేటటౌన్ : ప్రతి రోజు యోగా చేయడంతో ఒత్తిడి తగ్గుతుందని అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో హార్ట్ ఆఫ్ లివింగ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగా చేయడంతో మానసిక ప్రశాంతతతో పాటు, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఆర్ఐ నారాయణరాజు, ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, సురేందర్‌రెడి, హార్ట్ ఆఫ్ లివింగ్ ధ్యాన కేంద్రం యోగా సీనియర్ శిక్షకులు భిక్షపతి, స్వర్ణ, సందీప్, సునీత పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

భానుపురి (సూర్యాపేట) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక భానుపురి ఉన్నత యోగా సాధన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మండలి నిర్వాహకులు దేవరశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యోగా గురువులు సాధకులతో యోగా ఆసనాలు చేయించారు. అనంతరం సాధకులు గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరుణాకర్, శంకరాచారి, చంద్రశేఖర్, కందిమళ్ల రమేష్, ఇందిరా, యామ రాంమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : యోగా సాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మండల వైద్యాధికారి స్రవంతి అన్నారు. ప్రపంచ యోగా డే సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి యోగాసనాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. యోగాను జీవితంలో భాగస్వామిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఏఎన్‌ఎం వీరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో..

సూర్యాపేట : మండల పరిధిలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 500మంది విద్యార్థులతో పాటు 100మంది ఎన్‌సీసీ విద్యార్థులు, 100మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బి.శంకర్‌నాయక్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ఆయన గంటసేపు యోగా సాధన చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఏఎన్‌ఓ డాక్టర్ జి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ బి.చంద్రబాబు, పీడీ కె.శ్రీదేవి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుంది

ఆత్మకూర్(ఎస్) : ప్రతిరోజు యోగాసనాలు వేస్తే శరీర దృఢత్వంతో పాటు రోగ నిరోధక శక్తి, మానసిక ప్రశాంతత పెరుగుతుందని మండల వైద్యాధికారి వీరేంద్రనాథ్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆసానాలు వేసి యోగా ప్రాముఖ్యతను ఆయన వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆవుల వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ రంగమ్మ, పాఠశాల హెచ్‌ఎం సైదులు, ఉపాధ్యాయులు రవికుమార్, రమణ, అశోక్, విజయ్‌కుమార్, ఎస్‌ఎంలు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత

చివ్వెంల : సూర్యాపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పలువురు అధికారులు యోగా ఆసనాలు వేశారు. కార్యక్రమంలో యోగా గురువు గూడూరు నాగేశ్వర్‌రావు, అధికారులు చంద్రశేఖర్, శ్రీదేవి, ప్రిన్సిపల్ పుండరికాచారి, డాక్టర్ రామకృష్ణ, వై.శ్రీనివాస్‌ం విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : నిరంతర యోగా సాధనతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని ప్రముఖ యోగా డాక్టర్ పగిళ్ల సైదులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే అర్వపల్లిలోని కేజీబీవీలో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో సీహెచ్‌ఓ ఎల్.చరణ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఎస్‌ఓ నాగరాణి, ఏఎన్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం వేళల్లో 30 నిమిషాల పాటు యోగా చేస్తే ఆరోగ్యంతో పాటు ఆయుష్ ప్రమాణాన్ని పెంచుకోవచ్చని జిల్లా వైద్యాధికారి కోటాచలం అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని మల్లెల వందన, పద్మావతి, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ స్వరూపాకుమారి తదితరులు పాల్గొన్నారు.


తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టులో యోగా చేస్తున్న జడ్జి ఫర్హిన్‌కౌసర్

నాగారం : యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగా కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. నిత్యం యోగా చేయడంతో శారీరక రుగ్మతలు తొలగి, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. మానసిక ఒత్తిడిని జయించడానికి, ప్రశాంత జీవనం గడపడానికి యోగా ఎంతో తోడ్పడుతుందన్నారు. అలాగే మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులచే యోగా కార్యక్రమాలను చేయించారు. కార్యక్రమంలో పీఈటీ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఎం.నారాయణ, రమేష్, మధు, హేమమాళిని, నళిని, రషీద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంఈఓ రాములునాయక్ అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫర్హిన్ కౌసర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యోగాతో అనేక లాభాలు ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేటటౌన్ : యోగాలో పాల్గొన్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది


తిరుమలగిరిలో యోగా ఆసనాలు వేస్తున్న విద్యార్థులు


తిరుమలగిరి : యోగా చేస్తున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం, సిబ్బంది


చివ్వెంల : యోగాలో పాల్గొన్న అధికారులు


పెన్‌పహాడ్ : యోగా చేస్తున్న వైద్య సిబ్బంది